# శుభలేఖ

ఉలాపు బాలకేశవులు

■సుశీలకు పెళ్ళా? అన్నయ్యగాని వచ్చి చెప్పాడా? వదిన కూడా వచ్చిందేమిటి? అని ఏకధాటిగా ప్రశ్నల వర్షం కురిపించాడు.

ఎవరూ రాలేదు. ప్రక్కింటి సుబ్బలక్ష్మమ్మగారి కొడుక్కి దారిలో కనబడి మీ అన్నగారు శుభలేఖ యిచ్చారట. పెళ్ళి ఈ ఆదివారం దాటితే వచ్చే బుధవారమే అంది జానకి శేఖరం చేతిలోని తుండుగుడ్డ అందుకుంటూ.

పెళ్ళి బుధవారమేనా? అయితే మనకీ విషయం ఎవరూ చెప్పారు కాదేం? మనకు శుభలేఖ కూడా రాలేదా? ఆశ్చర్యపోయి అడిగాడు రాజశేఖరం వాలు కుర్చీలో కూలబడుతూ.

ఇంకా శుభలేఖ వస్తుందని ఎదురు చూస్తున్నారా? వచ్చేదయితే ఏనాడో వచ్చేది. అంతే కాదు బావగారూ, అక్కయ్యా స్వంతంగా చెప్పి వెళ్ళేవారు. చెల్లి పెళ్ళి జరుగుతూంటే పోసిననాడు మన యింటి ముందు నుండి కుంకుమ భరిణపట్టుకొని రిక్షాలో వెళ్ళిపోయిందామె. పాపను ఉయ్యాల్లో వేసేటప్పుడు మనల పిలవనేలేదు. చిట్టిగాడికి అక్షరాభ్యాసం చేసిన రోజున ఊరంతా పిలిచి వేడుకలు చేసిందామె. కాని మన యింటి గడపకైనా బొట్టు పెట్టలేదామె నాభర్త బీదవారే కావచ్చు నేను బీద పిల్లనే కావచ్చు. ఆమెకు లాగ నాకు ఖరీదైన నగలు, చీరలు లేకపోవచ్చు. కాని నాకూ ఆత్మాభిమానం ఉంది. ఆత్మ గౌరవం వారికెంత ప్రధానమో నాకూ అంతే. అంది జానకి ఒణికే గొంతుకతో, సగం త్రాగి వదిలేసిన కాఫీగ్లాసు నేలమీద ఉంచుతూ.

జానకీ! వదిన మనస్తత్వం నాకూ తెలియక పోలేదు. నీవెంత బాధపడుతున్నావో కూడా తెలుసు. కానీ అవన్నీ మనసులో నుంచుకొని బంధుత్వాన్ని తెంపుకుంటామా? వాడు నాకు అన్న. ఒకే తల్లి కడుపున మేము పుట్టకపోవచ్చు. కాని అలాగే పెరిగాము. మా పెద్దమ్మ నన్ను వాడితో సమానంగా చూసేది. వాడిలా నాకు చదువుకోడానికి అవకాశాలు లేవని తెలిసి ఎంతగా విచారించాడో తెలుసా జానకీ! అలాంటి అన్న ఎవరికి మాత్రం దొరుకుతాడు? వదిన వచ్చిన నాటి నుండి, వాడు కాలేజీలో లెక్చరర్ అయిన దగ్గరినుండి కొద్దిగా వాడి ప్రవర్తన కూడా మారింది. అంత మాత్రానికి నేనంటే వాడికి అభిమానముండదనా? అది ఒట్టి పిచ్చిమాట. అంతెందుకు సుశీల సంగతి నీకు తెలుసు గదా! అన్నయ్యా అని నోరార పలుకరిస్తుంది. దానికి నేనంటే ఎంతో అభిమానమని నీవే చెపుతుంటావు. మన పెళ్ళయిన క్రొత్తలో దానికి నీవు చీర కొనియిస్తే ఎంత మురిసిపోయింది! ఎందరికో చెప్పి సంతోషించింది. అన్నాడు రాజశేఖరం.

తమ్ముడనే వాడు ఒకడు సంతోషించే వాడున్నాడని తెలిసి కూడా బావగారిలా ప్రవర్తిస్తారని నేననుకోలేదు. వాళ్ళకు మనల పిలవాలనిపించలేదు. పిలవలేదు. పిలువరు కూడ" అని జానకి. ఆమె మాటాడుతుంటే కంఠం బొంగురు పోయింది.

"ఏడుస్తున్నావా జానకీ? అన్నాడు రాజశేఖరం విచారంగా.

"లేదు లేదు ఏడవటం లేదు! విచారిస్తున్నానంతే. ముందు కాఫీ చల్లారి పోకుండా తీసికోండి. అన్నది జానకి ఆమె కంఠంలో జీర ఇంకా పూర్తిగాపోలేదు.

"జానకీ! అన్నయ్య అంతపూర్తిగా మనల మరిచిపోడు. పెళ్ళి పందడిలో తమ్ముడే కదా తరువాత చెప్పవచ్చు అనుకొని ఉండవచ్చు. అయినా సుశీల పెళ్ళికి శుభలేఖలిచ్చి పిలవాలా జానకీ? అది మాత్రం నాకు చెల్లాయి కాదూ? వాళ్లు పిలవక పోయినా మనం వెళ్ళటంలో తప్పేముంది? అన్నాడు రాజశేఖరం కాఫీ గ్లాసు అందుకొని.

ఆమాట మీరంటారని నాకు బాగా తెలుసు. బహుశా మీరన్నట్టుగానే బావగారు భావించి ఉండవచ్చు. కాని అక్కయ్యగారి సంగతి బాగా తెలుసు నాకు. రమేశుడికి భోగిపళ్ళు





అపును పాపం అందుకే పాపం ఆ పిచ్చిపిల్ల వదినగారి చేత తిట్లు తిన్నది. నిజానికి వాళ్ళింటికి వెళ్ళబుద్దే అవదు నాకు. కాని సుశీల ముఖం చూసి ఆపిల్ల ఎంత నొచ్చుకుంటుందో అని వెడుతుంటాను. అంది జానకి గోడకు చేరగిలబడుతూ.

ఇద్దరి మధ్యా నిశ్శబ్దిత నాట్యం చేసింది. మౌనంగా చాలా క్షణాలు గడిచిపోయాయి. దేవుని గుడిలో నగారాలు వినబడ జొచ్చినవి. జానకి తలఎత్తి వీధిలోకి చూసింది ఆకాశంలో అలుముకోపోతున్న చీకటి నుండి లేచి హరికన్ లాంతరు వెలిగించి, దీపాన్ని చూసి మంగళసూత్రాన్ని ఒకసారి కళ్ళ కద్దుకొని, లాంతరుసు రాజశేఖరం దగ్గరగా టేబిల్ మీద వుంచుతూ అతని కుర్చీకిసమీపంలో కూర్చుంది జానకి. ఏదో మాటాడదామని తల ఎత్తి భర్త ముఖంలోకి చూడబోయి. అతని కళ్ళలో నిండిన కన్నీరు చూసి తన ప్రయత్నాన్ని విరమించుకున్నది. భర్తకంటిలో నీరు గమనించనట్టుగా దీపం వైపు చూస్తూ చీకటి పడిపోయింది. కాస్త స్నానం చేసి బజారుకొకసారి వెళ్ళిరాకూడదూ? బావి దగ్గర నీళ్ళుతోడి ఉంచుతాను లెండి" అందామె.

జానకి చూడకుండా కన్నీళ్ళు తుడుచుకొని లేచాను రాజశేఖరం. భర్తకు నీళ్ళుతోడటానికి వెళ్ళిపోయింది జానకి.

రాజశేఖరం స్నానం చేస్తూంటే గిలకదూలం మీద తువ్వాలుంచుతూ. సుశీల పెళ్లికి మనమేమైనా పెట్టకపోతే ఎలాగ? అందామె.

అవును, సుశీలకు ఏమిటిపెడదామంటావు? అన్నాడు రాజశేఖరం. తలమీద నీళ్ళు గుమ్మరించుకుంటూ.

ఆదేదో మీరే చెప్పండి. మీరన్నాదానికి ఎప్పుడైనా కాదన్నానా? అంది జానకి. బావి కంచంలో పడ్డ నీళ్లు త్రుళ్ళి చీరమీద పడకుండా చీరను పైకెత్తికట్టుకుంటూ.

రాజశేఖరం బిందెలో జర్మన్ సిల్వర్ చెంబుంచుతూ జానకీ సుశీల పెళ్లికి ఏదో ఒకటి ఘనంగా యివ్వాలనిఏనాటినుండో అనుకుంటున్న మాటేగా సుశీల పెళ్లికసి భద్రపరచిన సొమ్మంతా సెట్టిగారి దగ్గరే వుంది. ఆయనను యింకో అయిదారు వందలడిగి తెద్దామనుకుంటున్నానుఅన్నాడు. జానకి ముందు రాజశేఖరానికేమీ దాపరికాలులేవు. జానకి కూడ అతనన్నమాట కాదనదు.

అవును. కనీసం రెండు చేతులకూ రెండు జతల గాజులన్నా పెట్టకపోతే ఏంబావుంటుంది రెండు కాసులు పెట్టి గొలుసు నెక్లెసు అయినా చేయించకపోతే ఎలాగు? పెళ్లినాటి శుభదినం నాడు ఒకపట్టుచీరైనా కొని కట్టించాలి అందామె. తుండుగుడ్డకై చేయిజాచిన రాజశేఖ

## ఫోటో కవిత



నిన్నె మొన్నటి మానవుడా
నేటికలా మిగిలిన సామాన్యుడా
ఎన్నికలనంతలో
చూసిన వెన్నెన్నో వింతలు—
వాగ్దానాల విన్యాసాలు
నినాదాల గాలిమేడలు
నక్కవినయాల గౌరవాలు!
నలువైపుల అరచేతి స్వర్గాలు!
సంత ముగిశాక మిగిలిందేమిటి?
నైరాశ్యం నిండినచూపులు
తవశ్యం చచ్చిన బతుకులు
స్వప్నలోకాన మిగిలిన దారిద్ర్యం
—ని ముదుగా ఎదిగిన పాలకవర్గం!!

"కిరణ్ ప్రభ"

ఫోటో: జనార్దన్

రంకు తుండగుడ్డ అందిస్తూ ఆమె చేతిగాజుల శబ్దం విని తలఎత్తి ఆమె చేతులను ఒక్క క్షణం పరిశీలించాడు. క్రమంగా అతని చూపులు ఆమె మెడలో అమరిన పవిత్రమైన మంగళ సూత్రాలుగల పసుపుతాడు మీద ఆ పసుపుతాడును అల్లుకొనిపోయిన నల్లపూసల దండ మీదా నిలిచాయి.

రాజశేఖరం చూపులో భావం జానకిఅర్థం చేసుకున్నది. మెడనిండా చీరకొంగు కప్పుకొంటూ నేను చెప్పవలసింది చెప్పాను. ఆ పైన మీ యిష్టం. పెళ్లిలాంటి శుభమహోత్సవం ఎవరికైనా ఒక్కసారే అలాంటి శుభదినం నాడు మనమీ మాత్రం సుశీలకు పెట్టక పోతే ఏం బావుంటుంది? మీ శేఖరం అన్న ఏం చేయించారంటే ఆ పిల్ల ఏం చెపుతుంది పాపం? అంది జానకి.

జానకీ నేను మాత్రం నీ మాటకాదన్నానా నీవు చెప్పినట్టుగానే సుశీల నగల కోసం ఏర్పాటు చేయిస్తాను అన్నాడు రాజశేఖరం.

బజారులోకి బయలుదేరుతున్న రాజశేఖరాన్ని త్వరగా వచ్చేయమని చెప్పి వంటిల్లు చక్కపెట్టుకొని కనకాంబరాలు ముందుపోసి కొని మాలకట్టడంలో నిమగ్నురాలైంది జానకి. ఆమె చేతులు కనకాంబరాలను మాల కడుతూనే ఉన్నాయి. ఆమె మనసు రాజశేఖరం గురించి ఆలోచిస్తునే ఉంది.

రాజశేఖరం లాంటి భర్త తనకు లభించటం తన అదృష్టంకాక మరేమిటనుకున్నది. జానకి రాజశేఖరం మంచితనాన్ని గుర్తించనిరోజు నిజానికి లేనేలేదని చెప్పాలి. రాజశేఖరానికి తాను ఋణపడి ఉన్నది. అనుకుంది జానకి. రాజశేఖరంను చూసిన నాటి నుండి అతని మెడ భక్తిభావం నెలకొనిపోయింది జానకిలో.

*     *     *     *

ఆనాడు........

రాత్రి చాల చీకటి పడిపోయింది. జానకి తండ్రి గాలికోసం వీధిలో మంచం వేసికొని కూర్చున్నాడు. జానకి వంటింటి పని పూర్తి చేసికొని ఏదో పుస్తకం తిరుగవేస్తోంది. హరికన్ లాంతరు ముందు అమ్మా జానకీ దీపం పట్రామ్మా అన్న తండ్రి పిలుపు విని మధ్య గదిలో కోడిగుడ్డు దీపం వుంచి, లాంతరు పట్టుకొని వీధిలోకి వెళ్లింది జానకి. తండ్రి మంచం మీద ఆయనకు ప్రక్కగా కూర్చున్న రాజశేఖరాన్ని చూసి గబగబా దీపాన్ని తండ్రి ముందుంచేసి యింట్లో కొచ్చి వీధిగదపలో కూర్చుండి పోయింది. చీకటిలోనున్న జానకికి దీపపు వెలుగులో రాజశేఖరం ముఖం స్పష్టంగా కనిపించింది. ఎప్పుడూ సంతోషంగా ఉండే అతని ముఖంలో విచార రేఖలు చూసి దిగాలుపడిపోయింది. క్రమేణా తండ్రి మాట్లాడుతున్న విషయంపై ధ్యాస మరలింది.

ఆయన అంటున్నారు జరిగిందంతా విన్నాను బాబూ ఏంచేస్తాం? పోయిన వారితో మనం కూడా పోతామా? ఆమె యింతకాలం బ్రతకటం నీ అదృష్టంవల్లే. నిజానికి మీ చిన్నక్కయ్య పెళ్లికే ఆమె ఏదో అయిపోవలసింది. ఆమె యింకా బ్రతికి ఉంటే నీ చదువు కొంతైనా పూర్తి అయ్యేది అయితే ఏంచేయదలిచుకున్నావు శేఖరం? ఈ ఊళ్లోనే ఉండదలచున్నావా? అక్కయ్యల దగ్గర ఉందామనుకుంటున్నావా? ఇంతకీ ఎక్కడ ఉండదలచుకున్నావు? అని పరామర్శించారు.

"ఏం చేయాలో తోచటంలేదు మాష్టారూ! అక్కయ్య ప్రవర్తనలు కూడ నాకేమి అర్థం కావడంలేదు. ఇద్దరూ అమ్మ చనిపోయినప్పుడు వచ్చారు కాదు, అన్నయ్య పరామర్శించివెళ్లిపోయాడంతే. అక్కయ్యలు నామీద కొంత కోపం....తో ఉన్నారేమో అనిపిస్తుంది అమ్మకాని, నాన్నగాని నాకేమీ యిచ్చి వెళ్ళలేదు. ఇల్లు తప్ప ఉన్నదేమీలేదు. ఇల్లునైనా అమ్మ ఎవరి పేరిటా వ్రాయించలేదు. అమ్మ యిల్లు నా పేరిటే వ్రాయించింది అన్న అపోహతో అక్కయ్యలెవ్వరూ యిటుతొంగి చూడలేదు. వాళ్ళకు యింటిమీద నావలె హక్కులున్నాయన్నది నేను కాదనను. సమయం వస్తే యింటిని వారిద్దరికీ పూర్తిగా వదలివేయడానికి నాకేమీ అభ్యంతరంలేదు. అమ్మా నాన్నా నన్ను బీదవాడిగా మిగిల్చివేశారు కదా అని బాధపడను. అక్కయ్యలెవరూ ఆదరించలేదుకదా అని బాధపడను తోబుట్టువులుండి కూడ లేనివాడనయ్యాను కదా అని బాధపడుతున్నానంతే. నేనిక చదవదలచుకోలేదు. ఈ ఊరిని విడిచి పెట్టదలచుకోలేదు. ఇక్కడే, ఎక్కడో అక్కడ నాకు తగ్గ ఉద్యోగంకోసం ప్రయత్నిస్తాను. దొరక్కపోదు. నన్ను దీవించండి మాష్టారూ. మీరు దీవిస్తే అపజయమంటూ ఉండదు మేష్టారూ అంటూ కళ్ళనీళ్లు పెట్టుకున్నాడు రాజశేఖరం.

జానకి గుండెనిండా నీళ్ల నిండిపోయాయి

విచారించకు శేఖరం జరగవలసింది ఎలాగైనా జరుగుతుంది. నీవు మాత్రం చదువు మానేయవద్దు. కనీసం యస్.యస్.సి అయినా పాసుకాకపోతే లాభంలేదు బాబూ ఆటు తర్వాత నీకేదైనా కాస్తమంచి ఉద్యోగం చూస్తాను ఒక్క సంవత్సరం కష్టాలు భరించు బాబూ అన్నారాయన.

రాజశేఖరం అయోమయంగా చూశాడు. తరువాత ఆయనే అన్నారు. చదువుకోవాలంటే డబ్బు పట్టుకోవాలి. అది నాకు తెలుసు. నీవు డబ్బుగురించే ఆలోచిస్తున్నావని కూడ తెలుసు

### చొక్కా

పురావస్తుశాఖాధికారి అయిన రాజా ఒక్కగా ఉండడంచేత చొక్కావిప్పి మ్యూజియంలోని ఓ మేకుకు తగిలించాడు. అరగంట తర్వాత మ్యూజియం చూడడానికి వచ్చిన ఓ విజిటర్ దాన్ని చూసి

"ఈచొక్కా ఎవరిది?" అని ప్రశ్నించాడు.

"విక్రమాదిత్యునిది" చెప్పాడురాజా

—పి. వినయకుమార్,
(విజయనగరం)

నీవు ఏమనుకోకపోతే నేనొకపని చేస్తాను చెస్తావా?

జానకి మనసు ఉగ్గపట్టుకొని విన్నది.

చెప్పండి మాష్టారూ? అన్నాడు రాజశేఖరం

నాకు తెలిసిన సెట్టి ఒకాయన ఉన్నాడు. అతని దగ్గర పద్దులు రాయడానికి నిన్నుకుదురిస్తాను. నెలకు కనీసం యాభై రూపాయలన్నా ఈయకపోడు. దానితో నీవు చదువుకోడానికి పుస్తకాలు కొనుక్కోవచ్చు. మిగుల్చుకుంటే బట్టలు కుట్టించుకోవచ్చు. ఇక భోజనం విషయం—ఆవిషయంలో నేను నీకున్నాను అన్నారాయన.

"మాష్టారూ! అన్నాడు శేఖరం.

అవును నాయనా ! సాటి వారింటిలో భోజనం చేస్తే తప్పులేదు బాబూ నీవు మా యింటిలోనే భోజనం చేయవచ్చు. సందేహించకు అన్నారు.

"మేష్టారూ!" అన్నాడు రాజశేఖరం. అతని కళ్ళలో కృతజ్ఞతాభావం తొణికిసలాడింది. జానకి కన్నుల్లో వెలుగు నిండింది.

ఆమర్నాడే తండ్రి చెప్పక పూర్వమే బియ్యం ఎక్కువ పోసింది వంటకు జానకి.

రాజశేఖరం మాష్టారి సలహా ననుసరించి సూరయ్య సెట్టి కొట్టులో పద్దులు రాయడానికి కుదిరాడు. ఆయన్ని యింటి నుండి కదలనీయక ఉదయంలేవగానే బజారుపనంతా చూసేవాడు. తనింటిలో స్నానం చేసివచ్చి మాష్టారింటిలో భోజనం చేసేవాడు. సాయంత్రం కొట్టుకి వెళ్ళి పని ముగించుకుని ఏడు గంటలకు వచ్చేవాడు. ఇద్దరూ కలిసి భోజనం చేసేవారు. జానకి వాళ్ళిద్దరికీ భోజనం వడ్డించేది. మొదట్లో జానకి ముందు సిగ్గుపడేవాడు రాజశేఖరం. బజారునుండి కూరగాయలు తెచ్చి ఇదుగో కూరలు—అనేవాడు. జానకికి నవ్వు వచ్చేది. నవ్వాపుకునేది. ఒకసారనేసింది. నా పేరు ఇదుగో కాదు. అని రాజశేఖరం ఏమనాలో తెలీక వెళ్ళిపోయాడు.

రాజశేఖరం జానకి తండ్రి సలహాను అనుసరించే ఇంటిని రెండుభాగాలుచేసి ఇద్దరక్కయ్యలకు పంచివేశాడు. పరీక్షలు పూర్తయిన వెంటనే ఇంటిలో ఉన్న వంట సామాను మూడు భాగాలు చేసి రెండు వంతులు అక్కయ్యలకుపంచేశాడు రాజశేఖరం. రాజశేఖరం మంచితనాన్ని అర్థం చేసుకోలేక తాము ఎక్కడ యింటికోసంకోర్టుకెక్కుతామో అని భయపడీ యింటిని వాటాలుచేసి పంచేశాడని. బావగారు వ్యాఖ్యానించిన సంగతి రాజశేఖరంకు తెలియక పోలేదు. మూడువంతులుచేయవలసిన యింటిని రెండువంతులేచేసి ఎందుకు యింటిని వదిలేశాడు అన్న విషయం మాత్రం ఎవరూ గమనించలేదు.

ఫోటో

ఒక గాడిదమీదెక్కి- ఫోటో తీయించుకుని తన తాతకు చూపించాడు.

"బాగున్నానా తాతయ్యా?"

"ఆ! కాని నీమీద ఎవడో ఎక్కి-కూచ్చున్నట్లుంది ఎవడురా అది?"

పరీక్ష ఫలితాలు తెలిసిన తర్వాత మేష్టారి సహాయంతో ఎనభై రూపాయిల ఉద్యోగం సంపాదించుకోగలిగాడు. కొంత అద్దెరూపేణా యిచ్చి ఒక యింటిని కుదుర్చుకున్నాడు. రాజశేఖరం ఉద్యోగం సంపాదించుకోగలిగినప్పటికీ, మాష్టారింటిలోనే భోజనం చేసేవాడు. ఆకాలం నాటికి అతనాయింటిలో వ్యక్తిలా యిమిడిపోయాడు. మేష్టారు చేసిన సహాయానికి అతనిలో కృతజ్ఞత నిండిపోయింది. ఆయన చేసిన సహాయానికి ఋణం తీర్చుకోవాలనే కాంక్ష అతనిలో పటిష్టమైపోయింది. నిజానికి ఆయన ఋణం తీర్చుకునే సమయం రానే వచ్చింది. "ఎవరైనా ఈ లోకాన్ని వీడిపోకతప్పదనే సత్యాన్ని ఆయననుసరించక తప్పలేదు.

ఆయన మంచమీద వున్నపుడు-జానకి! అంటూ గొణిగారు: "అవును జానకి—నాకు కొడుకన్నవాడుంటే జానకిని నాకోడలిగా చేసుకొందును. నేనుమాత్రం ఏంచేయగల"

నన్నట్టు పలికారు ఆయిన చెల్లాయి. ఆతృతగాచూశారాయన, చుట్టువున్న అందరివైపు, దీపపు వెలుగులో ఆయన ముఖంలో తారాడే నీలినీడలు చూశాడు రాజశేఖరం, జానకికనులలో నల్లని కన్నీరు చూశాడు. అందరివైపు పరికించి చూశాడు, ఎవ్వరిముఖాల్లో ఆతృత లేదు. రాజశేఖరం ఆయన చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు.

....మాష్టారూ! జానకి అంగీకరించితే ఆమెను వివాహమాడటానికి నాకేమీ అభ్యంతరంలేదు. ఈవిధంగానైనా మీఋణం తీర్చుకోగలనేమో! ఆమెకు యిష్టంలేని పక్షంలో ఆమెకు పెండ్లిచేసే బాధ్యతనాదే మాష్టారూ! చింతపడకండన్నాడు రాజశేఖరం.

జానకి రాజశేఖరం మాటాడిన దానిలో రెండవభాగం చెవులపడగానే చెవులు గట్టిగా మూసుకుంది. జానకి అభిమతం తెలిసిన మాష్టారు- జానకీ! ఈపెళ్ళి నీకిష్టమేకదూ! అన్నారు. నెమ్మదిగా మౌనంగా తలూపింది జానకి, నలుగురి ముందు మంచంమీదనుండే యిద్దరి చేతులు కలిపారు. ఆరోజు తెలవారు ఝామునే ఆయనీలోకాన్ని వీడిపోయారు.

ఒకమంచి రోజు చూసుకుని అన్నవరం గుడిలో తాళికట్టాడు రాజశేఖరం జానకిమెడలో అతి నిరాడంబరంగా జరిగిన బీదవాడి పెళ్ళికి జానకి మేనత్తగారు తప్ప రాజశేఖరంవైపు నుండి ఎవరూ రాలేదు. అంతేకాకుండా వదినగారు. తాదూరకంతలేదు, మెడకొక డోలట, అని పలువురిలో వ్యాఖ్యానించటంకూడ రాజశేఖరం వినకపోలేదు. వినిమౌనంగా వూరు

## ఫోటో కవిత

పాలకుల నీటిమూట వాగ్దానాలు?
ప్రతిపక్షాల నినాదపోరాటాలు,
ఇవిరెండూ-
ఎన్నడూ కలవని రైలుపట్టాలు!
నడుమసాగే పేదవాడి జీవితం
చిరువెలుగుల కోసం అనంత పయనం??


"కిరణ్ ప్రభ"



ఫోటో: ప్రకాష్.కె.కె

కున్నాడు. సామాన్యుడిగా పరిగణింపబడ్డ రాజశేఖరంకు జానకిని వివాహమాడటంతో బీదవాడన్న ముద్ర వేయించుకోక తప్పలేదు. బీదవాడైన రాజశేఖరం అద్దెయింటికి అతని అక్కయ్యలుగానీ, ఇంజనీర్లు అయిన బావగార్లుగాని, కాలేజీ చదువులు వంటపట్టించుకున్న వదినగార్లుగానీ వచ్చినట్టు ఆ చుట్టుపక్కలవాళ్ళు ఎవరూ, ఎప్పుడూ అనుకోలేదు. కాని రాజశేఖరం యింటికి వచ్చినా, రాజశేఖరాన్ని, అన్నా! అని ప్రేమతో పిలిచినా, కల్మషంలేకుండా మాట్లాడి నవ్వించేది సుశీల ఒక్కర్తే. మిగతావారు దారిలో కనపడినా కూడా చాలపని ఉన్నట్లు వెళ్ళిపోతారు.

రాజశేఖరం చరిత్ర తిరుగవేస్తున్న జానకికి ఒక సంఘటన గుర్తుకువచ్చి కళ్ళుచెమ్మగిల్లాయి. ఒకనాడు రాజశేఖరం ఏదోమంచి సినిమా ఊరిలో ఆడుతుంటే చూద్దామని




రెండురూపాయలు జేబులోవేసికొని వెళ్ళాడు. సినిమాకు వెళ్ళిన రాజశేఖరం గంట తిరక్కముందే యిల్లుచేరడంచూసి నివ్వెరపోయింది జానకి, భోజనం చేయకుండా కుర్చీలో కూలబడ్డాడు. జానకి అడగ్గా, మనసులో దాచుకోలేక, అంతమనిషి యింతయి, బావురుమన్నాడు రాజశేఖరం, సినిమా టిక్కెట్టుకొని హాలులోకి వెడుతూంటే అన్నగారు నారాయణరావు మిత్రులతో రావడం చూశాడట, వాళ్ళు కూర్చున్న చోటుకి వెళ్ళబోతే, అతనెవరో తెలియదన్నట్టు ప్రవర్తించాడట. అదిచూసి హాలులో యికకూర్చోలేక యింటికి వచ్చేశాడట. రాజశేఖరం చెప్పిన ఉదంతంవిని మనసులో కన్నీరు కార్చింది జానకి.

* * * *

వీధిలోంచి యింటిలోకి ప్రవేశిస్తూ హరికన్ లాంతరు పెద్దదిచేసి జానకి కంటిలో నీరుచూసి జానకీ! చీకటిలో కూర్చున్నావేం?

ఎవరోకరిది

రాజేష్: ఏరా ఆనంద్ నీ భార్యకు ఆ క్రొత్త నర్సింగ్ హోంలో ఆపరేషన్ చేయిస్తున్నావు. పైగా డాక్టరుకు ఇదే తొలి ఆపరేషన్ కేసంట?

ఆనంద్ పోనీలేరా, సక్సెస్ అయితే అతడి అదృష్టం కాకబోతే నాది

—యం.డి మౌలాషరీఫ్
(ఇల్లందు)

అని అడిగాడు.

భర్తరాక గమనించి పూలదండను గిన్నెలోపడేస్తూ..వెళ్ళిన పనిఏమయింది?....అంది ప్రసంగాన్ని మార్చాలనే ఉద్దేశంతో లాల్చీ తీసివేసి కుర్చీలో కూలబడుతూ జానకీ! శెట్టి అయిదువందలకి ఇంకో అయిదువందలు కలిపి యివ్వడానికి ఒప్పుకున్నాడు. బంగారయ్య రెండుమూడు రోజుల్లో నగలుచేయించియిస్తానన్నాడు. డబ్బు అధికం కావలసి వస్తే శెట్టి నడుగుతానన్నాడు. అన్నాడు రాజశేఖరం.

మతిమరపు

భార్య: ఏవండీ తేలు తేలండీ?

భర్త: ఎవరియినా మగాళ్ళని పిలవ్వే.

భార్య: అమ్మో నా రాతా. మీరుమగాళ్లు కారా!

భర్త: సమయానికి జ్ఞాపకం చేశావ్. కర్ర పట్రా.

"చీరసంగతి ఏంచేశారు?" అంది జానకి. "చీర బుచ్చిశెట్టి తెప్పించి పెడతానన్నాడు." అని అన్నాడు రాజశేఖరం.

భోజనం చేయడం ప్రారంభిస్తూ, నెయ్యివేస్తున్న జానకివైపుచూసి, జానకీ! ఈ విషయం విన్నావా అన్నాడు.

"ఏది?" అంది జానకి అయోమయంగా.

"మా అమ్మ తమ్ముడు, రాఘవయ్య అనే అతనున్నాడని చెప్తుంటాను. గుర్తుందా! మన పెళ్ళయిన తర్వాతకూడ వచ్చాడు మనింటికి, ఆయన ఇవ్వాళ బజారులో కనిపించాడు. సుశీల పెళ్ళికని వచ్చారట ఆయనేమన్నాడో తెలుసా? ఏమయ్యా శేఖరం! సుశీలపెళ్ళికి పిలిస్తే, నాపెళ్ళికెవరూ రాలేదు. నేను సుశీల పెళ్ళికి రానుపొమ్మన్నావటగా, అన్నాడు" అని చెప్పాడు రాజశేఖరం.

"మీరేమన్నారు? అంది జానకి."

నేను మాట్లాడలేదు. నవ్వి ఊరుకున్నాను.

మమ్మెవరు పిలువలేదని చెప్పలేకపోయారా? అందిజానకి కాస్త కోపంతో.

"జానకీ! వాడంటే తక్కువై పోయాడు గాని నేనెందుకు తక్కువకావాలి? జరిగినదేదీ ప్రతివారికి తెలియకపోదు. నిజం నిలకడమీదే తెలుస్తుంది. ఇంతకీ వాడు పెళ్ళికి పిలిచినా పిలువక పోయినా సుశీల కోసమైనా పెళ్ళికి వెడతాను. నేను ఏవిధంగా సుశీలను గౌరవించాలనుకున్నానో ఆ విధంగా గౌరవిస్తాను. నాకు వారెవ్వరితో పనిలేదు. వారు మర్యాదలు చేయకపోయిన నాకు పోయేదేమీ లేదు. నాకు, కావలసినదల్లా సుశీలపై పెళ్ళిపందిట్లో అక్షింతలు వేసిరావటమే" అన్నాడు.

"అవునులెండి వాళ్ళతో మనకు పనేమిటి? వాళ్ళెలాగు మనల పిలవరు. వెళ్ళినా మర్యాదలు చేయరు. అవన్నీ మనం మనసులో ఉంచుకుంటే సుశీల బాధపడుతుంది" అంది జానకి.

ఆరోజురాత్రి తనపెళ్ళి ఎంతకష్టంగా జరిగినదీ తలుచుకుంటూ నిద్రపోయాడు రాజశేఖరం.

మర్నాడు ఆదివారం ఉదయం ఎనిమిది గంటలవేళ న్యూస్ పేపర్ పక్కింటినుండి తెచ్చుకొని చూస్తున్నాడు రాజశేఖరం మధ్యగదిలో, అరటికాయ చెక్కుతీస్తూ కూర్చుంది జానకి, రెండు మూడుసార్లు భర్తను మాట్లాడించ ప్రయత్నించి, అతని నిశ్శబ్దాన్ని భంగపరచటం యిష్టంలేక ఊరుకుంది. పేపరు మడిచి చేతులు జాడించుకుంటున్న రాజశేఖరాన్నిచూసి....సుశీల పెళ్ళికి కట్నం ఎనిమిది వేలట! అంది జానకి అరటికాయ ముక్కల్ని గిన్నెలోని నీళ్ళలో పడేస్తూ

"కట్నం ఎనిమిదివేలట లాంఛనాలు అన్నీకలిపి ఇంకో రెండువేలు ఇస్తారట. సుశీలకు కాబోయే భర్తపేరు సుందర్రావట. విశాఖపట్నంలో పనిచేస్తున్నాడట. ఏదో పెద్ద పనట. రేపుపెళ్ళివారు వస్తారుట. మనవీధి చివరి మేడలోనే విడిదట!....అని ఏకబిగిని తాను సేకరించిన విషయాలన్నీ ఏకరువు పెట్టేసింది జానకి.

"ఎక్కడ సేకరించావు యిన్నివిషయాలు?" అని అడిగాడు శేఖరం.

పక్కింటి సుబ్బలక్ష్మమ్మగారితో ఎదురింటి రంగమ్మగారు చెపుతూంటే విన్నాను. రేపు సోమవారం పెళ్ళికూతుర్ని చేస్తారట సుశీలని, పెళ్ళి అట్టహాసంగానే జరపాలనుకొంటున్నారట మీ అన్నగారూ అతని పెద్దన్నగారూ, చిన్నన్నగారూ కలిసి నిన్ననే వచ్చేశారట. మీ అక్కయ్యలు బహుశా తెల్లవారే వచ్చేసి ఉండాలి. ఒక్కసారి వెళ్ళిరాకూడదూ మీ అన్నగారింటికి, అది జానకి చెప్పవలసి నవన్నీ చెప్పేసి, తలఎత్తిచూస్తూ శూన్య దృష్టితో గోడవైపు తదేకంగా చూస్తున్న రాజశేఖరం కంటికొలకుల్లో రెండు బిందువులు తొంగి చూడటం గమనించింది జానకి ఏమిమాటాడాలో తెలియలేదామెకు.

"జానకీ! ఇన్ని విషయాలు ఎదురింటి వారికి తెలిసినంతగా కూడ మనకు మాత్రం తెలియక పోవడం వింతకాదూ! వినిసంతోషించవలసినయిన్ని విషయాలు నాకు తెలిస్తే నేనూ సంతోషించనూ? స్వయంగా ఇంటికి వచ్చి చెప్పాలని ఆంక్ష పెట్టడంలేదు. కనీసం ఒక శుభలేఖ పడేస్తే అదినాకు చేరదూ? నేను చూసి సంతోషించనూ? నేను ఏమైన వాడికి పరాయివాడినా? వాడిబాధంతా ఒకటే. రూపాయినాణేలను విరజిమ్మే వాడిఅంతస్థుకి నయాపైసలనులెక్కపెట్టుకునే నేను సరితూగలేననే. వాడు చదువుకున్నవాడు. నేను చదువులేని వాడిని, వాడు డబ్బున్నవాడు. నేను డబ్బులేని వాడిని, బజారులోకి బయలుదేరితే అడుగడుగునా కనబడే డబ్బున్నవారితో తిరిగితే వచ్చే ఘనత నన్ను పలుకరిస్తే వాడికెలా వస్తుంది? డబ్బుకోసం గౌరవంకోసం, అభిమానించి పలుకరించగల తమ్ముడనే వాడున్నాడన్న సత్యాన్ని గుర్తించలేక పోతున్నాడు!" అన్నాడు రాజశేఖరం. మాట్లాడుతుంటే అతని గొంతుక బొంగురుపోయింది. జానకి తలవంచుకొని అరటిచెక్క నెమ్మదిగా పోగుచేస్తూ ఉండిపోయింది. కొన్నిక్షణాలు ఎవ్వరూ మాట్లాడలేదు. జానకి నెమ్మదిగా తలఎత్తి అయితే మీరుకూడా పంతం పడుతున్నారా? అంది. రాజశేఖరం ఆమె ప్రశ్నకు చకితుడై

అప్పటివరకు


"నానీ! అద్దం పగిలిందేం?" కోపంగా అడిగింది నానిత్య.

"ఏమో మమ్మీ. నాచేతిలో నుండి జారేవరకూ బాగానే ఉంది" అమాయకంగా చెప్పాడు ఆరేళ్ళ నాని.

—బి.వి.ఎస్. బాబు
(తెనాలి)

నాడు.... లేదు జానకీ! నేనెందుకు పంతానికి పోతాను? వాడి ప్రవర్తనచూసి బాధకలిగి అన్నానంతే....అని అన్నాడు.

"ఒక్కసారి బావగారింటికి వెళ్ళిరండి మనకులేక వాళ్ళింటికి వెళ్ళటంలేదు. వాళ్ళింటిమీద కూర్చుని తినటానికి వెళ్లటంలేదు. బంధుత్వాన్ని తెంచుకోలేక వెడుతున్నారంతే. అదిమాత్రం గుర్తుంచుకోండి. వాళ్లు ఏమన్నా అనగలరు. అంటారుకూడా, అంతమాత్రానికే మాటా మాటా పెంచుకుని దెబ్బలాట పెట్టుకోకండి అంది జానకి.




(ఐ) అంటే!

కొడుకు: అమ్మా "ఐ" అంటే ఏంటి?
తల్లి: నేను
కొడుకు: "ఐ" అంటే అమ్మ, ఐ అంటే అమ్మ

—భమిడిపాటి వెంకటేశ్వరరావు
(విశాఖపట్నం)

రాజశేఖరం మౌనంగా లేచి బట్టలస్టాండువైపు వెళ్ళాడు. అన్నగారింటికెళ్లిన రాజశేఖరం అరగంటలో తిరిగి వచ్చాడు. జానకి ఏం ప్రశ్నించకుండానే "అందరూ చాలా బిజీగా ఉన్నారు. ఎవరికీ నాతో మాటాడటానికి తీరిక ఉన్నట్టు కనుపించలేదు. అందుచేతనే వచ్చేశాను. కాళ్ళుకడుక్కుంటాను భోజనంపెట్టేయి అన్నాడు రాజశేఖరం జానకి మౌనంగా బావి దగ్గరికెళ్ళింది.

సోమవారంనాడు సాయంత్రంఆఫీసునుండి వస్తూనే శేఖరం శెట్టిదగ్గర నుండి పట్టుచీరా. జాకెట్టు గుడ్డా తీసుకొని యిల్లుచేరాడు. ఇల్లు చేరేసరికి రాఘవయ్యగారు కుర్చీలోకూర్చుని జానకితో ఏదోమాటాడుతున్నారు. రాజశేఖరం వస్తూనే నమస్కరించాడు. ఆయన పలుకరించాడు. ఏమోయి! అల్లుడూ! నీ సంగతేమీ బాగా లేదు. ఊళ్ళో చెల్లెలు పెళ్ళి అవుతుంటే నీవు పమ్మెచేయడం ఏమీ బాగాలేదు ఇవ్వాళ మీ చెల్లెలు శేఖరం అన్నయ్య రాలేదేం మామయ్యా! అని కూడా అడిగింది అన్నారు.

రాజశేఖరం కుర్చీలో చేరగిలబడి, చీరపొట్లం జానకి చేతికిచ్చి. నేను పమ్మెచేస్తున్నానని ఎవరన్నారు? మీరు రావద్దన్నా పెళ్ళిజరిగే రాత్రి వస్తాను. మా చెల్లాయికి కూడా ఆ విషయం చెప్పండి" అన్నాడు.

రాఘవయ్యగారాశించిన సమాధానం రాకపోయేసరికి కాస్తనిరుత్సాహపడి అన్నారు. పెళ్ళంటే మాటలా ? ఎంతపని? ఎంత కథ! ఎన్నిపనులో చూసుకోవాలి. నారాయణరావు ఒక్కడూ చూసుకోగలడా ? నీవన్నా కాస్త నాలుగురోజులు సెలవుపెట్టి సాయపడరాదుటయ్యా? అని.

రాజశేఖరంలో సహనం చచ్చిపోయింది.

"మామయ్యగారూ! మీరింత మంది ఉండగా జరగాల్సినపెళ్ళి నేనొక్కడిని లేకపోతే

ఆగిపోతుందా! జరగాల్సినదే ఆగిపోదు. నేను వచ్చి ఆ ఇంటిలో కర్రపెత్తనం చేయక పోయినా సుశీల పెళ్ళి జరిగి తీరుతుంది. అయినా ఎవరికీ లేని చింత మీకెందుకు? మీరమాయకంగా అడుగుతున్నారుగానీమీకుతెలి యని దేముంది యిందులో? అన్నాడు!

"ఆ ఇంటిలో ఉన్నవారెవ్వరికీ నీగురించి తెలుసుకునే అవకాశం ఉండదు బాబూ? కానీ నీతత్వాన్ని తెలిసినవాడిని కాబట్టి నిజాన్ని తెలుసుకో ప్రయత్నిస్తున్నాను.

రాజశేఖరం తుళుక్కుబడి "ఈ విషయం మీకెవరు చెప్పారు?" అన్నాడు.

"ఒకరు చెప్పనవసరం లేదు బాబూ! నిజాన్ని తెలుసు కోవాలను కుంటే ప్రతి ఒకరికీ తెలుస్తుంది." అన్నాడు. రాజశేఖరం మౌనం వహించాడు.

"నేనెందుకు వచ్చానో తెలుసా? అన్నారాయన. అర్థంకానట్లు చూశాడు రాజశేఖరం.

"ఎవరూ నిన్ను పెళ్ళికిపిలవలేదనీ నీవు దూరంగా ఉండటానికి వీలులేదు. నేనీపెళ్ళికి నిన్నూ. జానకిని స్వయంగా పిలుస్తున్నాను. పెళ్లిజరిగే నాలుగురోజులూ నీవక్కడే ఉండాలి." అన్నాడు.

"మీకందరికిదూరంగాఉండాలి. పెళ్లికైనా రాకూడదా, అని నేననుకునే వాడినైతే ఈ ఏర్పాట్లు అన్నీ ఎందుకు చేస్తాను జానకీ! కాగితం పొట్లం మామయ్యకియ్యి మీరెవరు రావద్దన్నా పెళ్లిజరిగేరాత్రి ముహూర్త సమయానికివస్తాను." అన్నాడు చీరపొట్లం అతని చేతికిస్తూ.

"అదేమిటి? పెళ్లింకా రెండురోజులుంది ఈ రెండు రోజులూ నీవక్కడే ఉండాలి" అన్నాడాయన చేరచూస్తూ.

"క్షమించు మామయ్యా! నేను రాలేను. నన్ను బలవంతం పెట్టవద్దు. పెళ్లికి వస్తానని మాత్రం సుశీలతో చెప్పండి" అన్నాడు.

రాఘవయ్యగారు రాజశేఖరాన్ని ఏమీ అన లేకపోయారు.


సుశీల పెళ్లి ఏర్పాట్లన్నీ చాలాఆర్భాటంగా చేశారు. నారాయణరావుగారు. మగ పెళ్లివారి తరపు నుండి సుమారు ఏభై మంది వున్నారు. అందరికీ నారాయణరావు తన యింటి ప్రక్క రెండిళ్ళలో విడుదులు ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరికీ మర్యాదలు జరపడానికి తన బలగాన్ని వినియోగించాడు. పెళ్లి ఏర్పాట్లు చేయడంలో ఆయనకు ఊపిరిపీల్చుకోడానికి కూడా తీరికలేకుండా పోయింది. పేకాటరాయుళ్ళు అంతా ఒకచోట విడిదిచేస్తే, కబుర్ల రాయుళ్ళు అంతా ఒక చోట చేరారు. రేడియో పాటలు, సినిమా కబుర్లు పెద్దల అనుభవాలు ఆయింటి గోడల్లో యిమిడి పోయాయి. ఆ యింట సుశీలా రాఘవయ్యగారూ తప్ప ప్రతి ఒక్కరూ కాలాన్ని హాయిగా గడపగలిగారు.

చేయను, తింటాను

"అప్పుడే స్నానం చేసి వస్తున్న భర్తను "టిఫిన్ చేద్దురురండి" ఆప్యాయంగా పిలిచింది భార్య.

"నేను టిఫిన్ చేయను. తింటాను" చెప్పాడు భర్త.

—ఈమని శ్రీనివాస్
(వినుకొండ)




ఫ్లాట్‌ఫాం టికెట్

టికెట్ కలెక్టర్: ఇది ఫ్లాట్‌ఫాంటికెట్ మరి అసలు టికెట్ ఏది?

ప్యాసింజర్: అదేంటి సార్! ఎక్కేది ఫ్లాట్‌ఫాం మీంనుంచి, దిగేది ఫ్లాట్‌ఫాం మీదకే! అందుకని ఈ టికెట్ కొన్నాను సార్

—చామర్తి సాయిగంగాధర్
(విజయవాడ)

నారాయణరావుగారి భార్య సావిత్రీదేవి ఒక పెళ్ళి చేయడంలోగల అనుభవాన్నిపొందుతున్నారు. పెళ్ళి చూట్టానికి వచ్చిన బంధు వర్గమంతా వాళ్ళు. వాళ్ళ పిల్లలు. వారి నగలు వారి హోదాలు. వారి చీరలు మొదలైన వాటిని గురించి యితరులకు వెల్లడి చేసుకోవడానికే కాలం సరిపడటంలేదు. ఇక పెళ్ళి పనులు చూడటానికి వారికేం వీలవుతుంది? బంధు వర్గం విముఖత రాఘవయ్య గారికేమీ నచ్చ లేదు.

పెళ్ళి జరిగే ఉదయం నుండి ఆర్భాటంగా సన్నాయి మేళాలు. సినిమా పాటలు మైకులో నుండి వెలువడి గాలిలో ప్రయాణించి రెండు వీధుల అవతల నున్న రాజశేఖరం ఇల్లు చేరాయి. ఉదయం నుండి రాజశేఖరానికి మతి మతిలో లేదు. కాఫీ నోటికి పోలేదు. ఏ పనీ చేయలేకపోయారు. మైకులోనుండి వస్తున్న పాటలు అతన్ని హేళనచేస్తున్నట్టు తోచిందా తనికి సెలవు పెడదామనుకున్న రాజశేఖరం నాలుగుమెతుకులు కతికి ఆఫీసుకు వెళ్ళిపోయాడు. జానకి అతని ప్రవర్తన చూస్తూ ఏమనలేకపోయింది! తానుకూడ నాలుగుమెతుకులు నోట్లో వడేసి కొని చేయి కడిగేసిఉంది.

కాలం యొక్క వేగమెంత? అని ఎవరన్నా ప్రశ్నిస్తే అది పిచ్చి ప్రశ్న అనిపిస్తుంది. నిజానికి ఒక సెకను ఒక సెకను కాలం ప్రయాణిస్తుంది. కాని అది అన్ని వేళలా సరికాదు. ఒకరికి ఒకప్పుడు ఒకగంట ఒక సెకనుకాలం గడిచినట్టు గడిచిపోతుంది. అదే వ్యక్తికి వేరొకప్పుడు ఒక సెకనే ఒక గంట అనిపించవచ్చు. ఇద మిద్దంగా కాలం యొక్క వేగం ఇంత అని ఖచ్చితంగా ఎవరూచెప్పలేరు. అంతే అనుకుంది జానకి. ఆరోజు ఒక యుగంలా గడిచిందామెకు.

సాయంత్ర మవుతుండగా ఆఫీసు నుండి పీక్కుపోయిన ముఖంతోవచ్చాడు రాజశేఖరం భర్తకు ఎదురువెళ్ళిన జానకిచేతికి గాజుల పొట్లం జాజిపిందెల నెక్లెస్ పెట్టె యిచ్చి మౌనంగా పెరటిలోకి వెళ్ళిపోయాడు.

రాజశేఖరానికి కాఫీయిస్తూ ఎంతయింది ఖర్చు?....అంది జానకి.

ఎంతో అంత అయింది. నీకుతెలియండేముంది అన్నాడు.

రాత్రి భోజనంచేశాననిపించాడు రాజశేఖరం. ముహూర్తకాలం ఒకగంట ఉందనగా బయలుదేరాడు రాజశేఖరం ఇంటినుండి జానకిని తీసుకొని తనకున్నవాటిలో మంచిబట్టలు వేసికొని ముస్తాబయ్యాడు. జానకి తనకున్న వాటిలో మంచిచీర తీసుకొని ముస్తాబయింది. పెళ్ళినాడు మేనత్త యిచ్చిన వెండిపళ్ళెంలో

రాజశేఖరంకొన్నచీర. జాకట్టుగుడ్డ. పసుపు కుంకం. అరటిపళ్ళుపెట్టి బయలుదేరింది.

పెళ్ళిపందిరి సమీపించారు జానకీశేఖరులు కలకల్లాడేపందిరిలోకి వచ్చేవారందరినీ ఆహ్వానిస్తున్నాడు నారాయణరావుగారు అన్నగారు వాళ్ళతో ఏదోకులాసాగా మాట్లాడుతున్నారు. నారాయణరారావుగారు మరదళ్ళువచ్చేవారందరికీ గౌరవంగా స్వాగతం చెప్పుతున్నారు. పందిరినిండా రంగురంగుల రకరకాల, టెర్లిన్, డెకరాన్ సాటిన్ చీరలు' వల్లెవాటులు రకరకాల బుష్‌కోట్లు రాజశేఖరానికి కనిపించాయి, రాజశేఖరం గుండె దడదడలాడింది, ముందుకు వెడదామా. వద్దా? అన్నసందిగ్దంలో పడ్డాడు. శరీరంలో ఎక్కడలేని నీరసం ఆవహించింది. ఒంటినిండా చెమటపట్టేసింది. యాంత్రికంగా ముందుకెడుతున్న రాజశేఖరానికి. అతన్నిచూసి ఎదురువచ్చే రాఘవయ్యగార్ని చూడగానే ఎక్కడలేనిఉత్సాహం వచ్చేసింది, రాజశేఖరాన్నిచూడగానే మహానందమైంది రాఘవయ్యగారికి రావయ్యా! అల్లుడూ రామ్మా! జానకీ! రండిరండి అంటూ లోనికి ఆహ్వానించారు. పందిట్లోఉన్న బంధువర్గానికీ, ఈఅల్లుడెవరో తెలియలేదు. వారికంతగా తెలుసుకోవాలనిపించనూ లేదు. రాఘవయ్యగారు వారిద్దర్నీ తనగదికి తీసుకొని వెళ్ళారు. ముహూర్తానికింకా అరగంట వ్యవధిఉంది. చెల్లాయినిచూస్తావా పద. అంటూ రాజశేఖరాన్నీ జానకినీ సుశీలఉండే గదివైపుతీసికొని వెళ్ళాడాయన. దారిలో నారాయణరావు కనపడి వచ్చావా? రావేమో అనుకున్నాను. ఉండు. పనిచూసుకొనివస్తా" నంటూ పందిట్లోకివెళ్ళిపోయాడు.

సుశీలచుట్టూ ఆమెవదినగార్లు అక్కగార్లుచేరి ముస్తాబుఅయిన సుశీలకేమేమో అలంకారాలు చేస్తున్నారు. సుశీల జానకినీ. రాజశేఖరాన్ని చూసింది. అందరిమధ్య నుండి సుశీల లేచి వచ్చి జానకిని "వదినా! అని పలకరించింది. ఇంతకాలానికి దయకలిగిందా అన్నయ్యా! అంటూ రాజశేఖరం. జానకీలముందు వంగి నమస్కరించింది సుశీల.

మాదీవెనలు ఎప్పుడూ ఉంటాయి సుశీలా? ఈ శుభసమయంలో కన్నీళ్ళు పెట్టుకోకూడదమ్మా?—అన్నాడు రాజశేఖరం.

"సుశీలా నీవు ఈ చీరకట్టుకోవాలని మీ అన్నగారు తెచ్చారు. కట్టుకోమ్మా.... అంటూ జానకి కళ్యాణతిలకంక్రింద చిన్నబొట్టుపెట్టి పసుపు కుంకుమఉన్న పళ్ళెం చేతికిచ్చింది జానకి.

సుశీల మనస్సులో ఆనందం పరవళ్ళు దొక్కింది. చుట్టూఉన్న స్త్రీలలో గుసగుసలు

వచ్చేవరకు

రాము: కొత్తల్లుడని ఎప్పటివరకు అంటారు.

సోము: తోడల్లుడు వచ్చేవరకు

సి. హెచ్. ప్రసన్నకుమారి
(గుంటూరు)


చెలరేగాయి అన్నీకాకపోయినా కొన్నయినా జానకిచెవిలో పడ్డాయి.

"ఏంచీరమ్మా అది?" అంది పెద్దబావగారి భార్యలక్ష్మి.

టెర్లిన్‌కాబోలు! ఈయనగారు స్వయంగా తయారుచేయించి ఉంటారు! రెండో తోడికోడలు రాధ.

"ఇంతకీ ఎవరుపిలిచారట ఈపెళ్ళికి? అని ప్రశ్నించిందో ముత్తైదువ.

"ఉండరా. వాళ్ళేదో కష్టసుఖాలు చెప్పు




కుంటున్నారు వినండి" అనికసిరిందొకఇల్లాలు.

"ఇక ఈయింటిలో మకాంవేస్తారుకాబోలు అంటూ బెంగపడిందొక శ్రేయోభిలాషిణి.

"సుశీలా? ఏంచేస్తున్నావమ్మా అక్కడ? ముహూర్తంకి టైమౌతుంది. పద. పద దా" అంటూ నారాయణరావుగారి భార్య సుశీలను లోనికి తీసుకెళ్ళింది.

అంకెలకు ఇళ్ళు

లెక్కలు క్లాసది

"ఎనిమిదింట్లో నుంచి ఐదుపోతే ఎంతరా?" అడిగాడు మాస్టరు రవిని.

"మనకున్నట్లే అంకెలకు ఇళ్ళు ఉంటాయని వినలేదే? బహుశ ఈమధ్యనే కట్టుకున్నాయట్లుంది" అమాయకంగా చెప్పాడు రవి.

—ఈమని శ్రీనివాస్
(వినుకొండ)

"అన్నయ్యా. వదినా? ఇద్దరూ భోజనం చేసి వెళ్ళండి" అంది సుశీల వెళ్ళబోతూ.

"వచ్చినవాళ్ళు భోజనం చేయకుండావెడతారా నీపిచ్చిగాని. పద, పద" అనితీసికెళ్ళారు సావిత్రీదేవి సుశీలను.

అంతా గొల్లున నవ్వారు. రాజశేఖరం. జానకీ వెనుదిరిగారు. రాఘవయ్యగారుమౌనంగా ముందుకు సాగారు.

జానకీ. రాజశేఖరములవైపుచూసి, వీళ్ళ ప్రవర్తన ఎప్పుడూ ఇంతే బాబూ! విచారించకు," అన్నారాయన.

ఇద్దరూ రాఘవయ్యగారి గదిలోకూర్చున్నారు. వాళ్ళకుపెళ్ళి మంటపం బాగాకనిపిస్తూంది. ఆగదిలోంచి. పెళ్ళిపందిరిలోఅంతా ఆసీనులయ్యారు. పురోహితులు పెళ్ళిమంటపందగ్గర ఏవేవోఆదేశాలిస్తున్నారు. మగపెళ్ళివారిని పెళ్ళికొడుకుని పెళ్ళిపెద్దలు బ్యాండు మేళాలతో ఎదురేగితెచ్చారు. పెళ్ళికొడుకు పెళ్ళిపీటమీద ఆసీనుడయ్యాడు. పురోహితులు చెప్పినప్రకారం చేస్తున్నాడు, రాజశేఖరం పెళ్ళికొడుకువంకచూసి జానకీవైపుతిరిగి చూశాడు, జానకి నిశ్చలంగా పెళ్ళితంతు చూస్తోంది. రాజశేఖరానికి గతం గుర్తుకొచ్చింది, బీదవాడిపెళ్ళికి. గొప్పవాడిపెళ్ళికీ ఏమిటితేడా? అని ఆలోచనలోపడ్డాడు. ఎదుట ఏమిజరుగుతుందో అతనికి తెలియటంలేదు. పెళ్ళికూతుర్ని గౌరిగంపలోతెచ్చే వేలయింది, పదండి పందిట్లోకి అంటూ యిద్దర్నీ పందిట్లోకిపంపేసి అంగవస్త్రం నడుముకు బిగించి ఇంట్లోకి వెళ్ళిపోయాడు రాఘవయ్య. రాజశేఖరం ఒకస్తంభాని కానుకొని నిలబడ్డాడు' అతనిప్రక్కన నిలబడింది జానకి. పెళ్ళిమంటపం వారికి కాస్తదూరంలోనే వుంది, పురోహితుడు.... పెళ్ళికూతుర్ని తీసికురండి, వేళయిపోతోంది" అంటూండగా రాఘవయ్యగారు గంపలో కూర్చుండబెట్టి సుశీలను తీసికొచ్చారు. సుశీల తలవంచుకొని కూర్చున్నది. పెళ్ళి మంటపానికి సమీ

తేనా? వీల్లేదు. ఒరేయి అబ్బాయి చూస్తావేం? మన తాహతుకి తగని వాళ్ళతో సంబంధం మేమిటి అందామె.

పెళ్ళికొడుకు ఏం చేయాలో తెలీకలేచినిలుచ్చున్నాడు

రాఘవయ్యగారు బాబూ పందిట్లో వాళ్ళతో విరోధింపబడటం బాగుండదు. నీకున్నవేవో. మీ ఆవిడవో వదినగార్లవో అక్కయ్యలవో పెట్టించేయి. తర్వాత చూసుకుందాం అన్నారు నారాయణరావుతో.

నారాయణరావు ఆడవారివైపు దృష్టి సారించారు. ఎక్కడ చలనంలేదు. నారాయణరావు భార్యవైపు చూశారు ఆమె మూతి ముడిచింది మిగతావారు మెడనిండా చీరకొంగు కప్పుకొన్నారు.

ఇంకా చూస్తావేంరా అబ్బాయి లే అందామెగారు.

ఆగండి అన్నాడు రాజశేఖరం ముందుకు నడుస్తూ. జానకి అతన్ని యాంత్రికంగా అనుసరించింది.

గౌరి గంపలో కూర్చుంచేనే మీ పిల్లఅయిపోయిందన్నారు. ఇప్పుడు ఈ సంబంధం వద్దంటున్నారు. మీ మాటలు మేమెలా అర్థం చేసుకోవాలి. మీకేమైనా కావలసి వుంటే యింతకు ముందే అడగాల్సింది. అంతేగానీ పెళ్లి పందిట్లో నలుగురి మధ్యన ఏమిటీ గందరగోళం అన్నాడు రాజశేఖరం.

భళా అన్నారు పెళ్లి పెద్దలు.

నాయనా నీ వెవరో నాకు తెలియదు. నీతో వాదించటానికి మేము రా లేదు. రా! రా! అబ్బాయి లేచిరా అందామె.

ఆగండి. మీతో వాదించడానికి నేనెవరో కాదు. సుశీల నా చెల్లెలు. మీరు లేచిపోనవసరంలేదు. అని జానకి చేతికి గాజులపొట్లం యిచ్చాడు రాజశేఖరం. జానకి పెళ్లి మంటపంలో పళ్లెంలో ఉన్న కుంకుమ తీసికొని సుశీల దగ్గరికి నడిచింది. అంత నిశ్శబ్దత ఆవరించింది. జానకి సుశీల నుదుటన బొట్టు

పెట్టి కుడిచేతికి రెండుగాజులు, ఎడమ చేతికి రెండు గాజులను తొడిగింది. అందరిదృష్టులు బంగారు గాజులను తొడుగుతున్న చేతిమట్టి గాజులపైనే నిలిచాయి. ఆ క్షణం గాజుల నిశ్శబ్దం తప్ప యింకేమీ వినిపించలేదా పెళ్లి పందిరిలో. రాజశేఖరం పెట్టెతెరిచి నెక్లెస్ తీశాడు. జానకి అతని చేతిలో నెక్లెస్ అందుకొని సుశీల వెనుకకు వెళ్ళి మెడలో నెక్లెస్ పెట్టింది. ఆమె వెనుకకు తిరుగుతూండగ, ఆమె మెడలో నల్లపూసలదండపై అందరి దృష్టులు నిలిచిపోయాయి. సుశీలలో దుఃఖం కట్టలు తెంచుకుంది. రాఘవయ్యగారి కళ్ళలో కన్నీరు మెరిసింది. నారాయణరావు కృతజ్ఞతాపూర్వకంగా చూశాడు రాజశేఖరం వంక.

పంలో కూర్చున్న సుశీల కాబోయే అత్తగారు సుశీల సమీపానికి వెళ్లి నారాయణరావును పిలిచింది. ఆయన రాగానే చూడబ్బాయీ అమ్మాయిని గౌరిగంపలో తెచ్చారు. బాగానే ఉంది.

గౌరి గంపలో అమ్మాయి కూర్చున్న క్షణం నుండీ మా పిల్లగానే మేము లెఖ్ఖపెట్టుకోవాలి అందుకనే కష్టమో నిష్టూరమో ముందే చెప్పేస్తున్నాను. పిల్లకు నగలు మీ రెప్పుడో పెడతానంటే సరికాదు. మీరేం పెట్టేసినా ఇప్పుడే పెట్టేశాయాలి. మీరు పెట్టిన వాటిని బచే ఉంటుంది మేము పెటేదీనూ అన్నారామె. అంత మందిలో మటాడడానికి జంకాడు నారాయణరావు మేము పెతే నగలు పెట్టనే పెట్టాం. ఇంకేంటి మీరనేది? అన్నాడు చివరికి తెగించి

అయితే మీరు పెట్టేనగలు యివేనా? ఇక అమ్మాయికేమీ పెట్టరూ? అందామె బుగ్గలు నొక్కుకుంటూ.

ప్రస్తుతానికింతే అన్నాడు వినయంగా నారాయణరావు.

అయితే ఎప్పుడో పెడతానంటారు అం

"ఇంకా మీకు అభ్యంతరమా?" అన్నాడు రాజశేఖరం.

"నాకభ్యంతరం లేదిక" అందామె.

రాజశేఖరం సుశీల చేతికి ఉంగరంతొడిగి పెళ్ళయిన తర్వాత మీ ఆయన చేతికి పెట్టు. అని రెండో ఉంగరం యిచ్చాడు. సుశీల అప్రయత్నంగా చేతులు జోడించి వంగి నమస్కరించింది. ఇద్దరికీ. జానకి ఆమెను తీసికొని పెళ్ళి మంటపంలోనికి వెళ్ళింది.

మంగళ సూత్ర ధారణ అయిపోయింది. రాజశేఖరం. ఇద్దరిమీదా అక్షింతలు జల్లి స్వేచ్ఛగా ఊపిరిపీల్చుకున్నాడు.

అనుకోని విధంగా దేవుడు తనకొకమంచి అవకాశాన్ని కలుగజేసినందుకు రాజశేఖరం దేవుడికి మనసులో జేతలర్పించాడు.

"వచ్చినపని అయిపోయింది." అన్నాడు రాజశేఖరం.

"పదండి" అంది జానకి.

పెళ్ళి పందిరి దాటి వస్తున్న రాజశేఖరం "బాబూ! రాజశేఖరం" అన్న పిలుపు విని వెనుదిరిగాడు జానకితో.

"ఎక్కడికి బాబూ! భోజనం చేయకుండా పోతారా?" అన్నాడాయన ఆవేదనతో.

"మామయ్యా వచ్చినపని అయిపోయింది. మమ్మల్ని బలవంతపెట్టకండి. క్షమించండి." అంటూ ముందుకు సాగాడు రాజశేఖరం—జానకితో.

రాఘవయ్యగారు వెనుదిరిగేసరికి సుశీల, సుందర్రావు గబగబావస్తూ కనిపించారు. వారి వెనుక నారాయణరావు పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"మామయ్యా! తమ్ముడేడి?" అన్నాడు నారాయణరావు.

"వెళ్లిపోతున్నా"డన్నారాయన.

"ఆపండి మామయ్యా!" అంది సుశీల సుమారుగా ఏడేచ్చకంఠంతో

"వాడినెవరూ ఆపలేరమ్మా వాడు రాజశేఖరుడు. అంతస్థులను అడ్డుపెట్టుకొని అనురాగాభిమానాలు గుర్తించలేని మీ అన్న వదినల లాంటి వాళ్ళ సంకుచితదృష్టికి రాజశేఖరుడూ జానకీ అందరమ్మా! ఎన్ని యిలాంటి సంఘటనలైనా డబ్బులో ఆటాడేవారిలో మార్పు లేకుండా ఉంది. అదే తమాషా!" అన్నారాయన.

"సుశీలా! రేపు తప్పక వారిద్దరి ఆశీర్వాదం పొందాలి, అన్నాడు సుందర్రావు.

నారాయణరావు కళ్ళలో నీళ్ళునిలిచి జారిపోయాయి.

